www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 జులై 2025 5 పశ్చిమ గోదావరి



నేడు జిల్లాలో మంత్రి సత్య ప్రసాద్ పర్యటన

భీమవరం : రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి సత్యప్రసాద్ శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం ఉదయం 8 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా దిండి రిసార్ట్స్ నుంచి బయలుదేరి ఉదయం 9.30కు మొగల్తూరు మండలం కాళీపట్నం(వెస్ట్) చేరుకుంటారన్నారు. 11.30 వరకు స్థానిక ఎంఎల్ఎ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. తిరిగి 11:30కు కాళీపట్నం నుంచి బయలుదేరి 11:45 నిమిషాలకు నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 12.30కు నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి బయలుదేరి 1.30కు ఆచంట చేరుకుని సాయంత్రం 5 గంటల వరకు స్థానిక ఎంఎల్ఎ ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఆచంట నుంచి బయలుదేరి విశాఖపట్నం వెళ్లనున్నట్లు జిల్లా సమాచార శాఖ తెలిపింది.

'జంగారెడ్డిగూడెం పట్టణంలో చిరు వ్యాపారి సంసోను సౌజన్య బ్యాగ్‌ల షాపు నడుపుతున్నాడు. స్మార్ట్ మీటర్ అమర్చక ముందు నెలకు రూ.514 బిల్లు వచ్చేది. అప్పట్లో అదనపు ఆదాయం కోసం చెరకు మిషన్ ఉపయోగించేవాడు. ఇప్పుడు చెరకు మిషన్ లేకపోయినా స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత గడిచిన జూన్, ప్రస్తుత జులై నెలలో విద్యుత్ బిల్లు రూ.900 వరకూ వచ్చింది. ఒకేసారి రెట్టింపు బిల్లు వస్తుండడంతో చెల్లించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు.'


'ఏలూరు నగరానికి చెందిన సత్యనారాయణ పవర్‌పేటలో ఫ్రూట్ జ్యూస్ షాపు నడుపుతున్నాడు. స్మార్ట్ మీటర్ అమర్చక ముందు బిల్లు నెలకు రూ.1,300 వరకూ వచ్చేది. ఇప్పుడు వర్షాకాలం జ్యూస్‌ల సీజన్ లేకపోయినా నెలకు రూ.1,900కుపైగా విద్యుత్ బిల్లు వస్తోందంటూ లబోదిబోమంటున్నాడు. ఈ విధంగా ఒక్కసారిగా కరెంటు బిల్లు పెరిగితే మాలాంటి సామాన్యులు ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.'

స్మార్ట్ మీటర్లతో బిల్లుల మోత..!

- 70 శాతం నుంచి వంద శాతం బిల్లులు అదనం
- స్మార్ట్ మీటర్ల అమరికతో వ్యాపారులు గగ్గోలు
- రెండు జిల్లాల్లో దాదాపు 80 వేల స్మార్ట్ మీటర్లు బిగింపు
- చిరువ్యాపారుల పరిస్థితి మరింత దారుణం
- గృహాలకు బిగిస్తే సామాన్య ప్రజానీకం విలవిలే..
- భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన



స్మార్ట్‌మీటర్ బిగించక ముందు బిల్లు రూ.514




స్మార్ట్‌మీటర్ బిగించిన తర్వాత జూన్ నెల బిల్లు రూ.928

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సంసోను, సత్యనారాయణలే కాదు. స్మార్ట్ మీటర్లు అమర్చిన వ్యాపారులంతా కరెంటు బిల్లులు కట్టలేక లబోదిబోమంటున్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి అధికారంలోకి వచ్చాక అదానీకి దాసోహమై స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు దిగింది. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ముందుగా వ్యాపార దుకాణాలకు అమర్చాలని, తర్వాత విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే గృహాలకు ఏర్పాటు చేసే విధంగా ముందుకు సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 సెప్టెంబర్ నుంచి స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రారంభించింది. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 4,58,435 గృహ వినియోగ కనెక్షన్లు ఉండగా మిగిలినవి కమర్షియల్, వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియలో విద్యుత్‌శాఖ అధికారుల జోక్యం లేకుండా అదాని నియమించుకున్న ఉద్యోగులే చేస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 200 మంది అదాని ఏర్పాటు చేసుకున్న ఉద్యోగులు ఈ పనిలో ఉన్నారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 34 వేల వ్యాపార విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం ఆరు లక్షల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉండగా తొలివిడతగా 2.10 లక్షల వ్యాపార దుకాణాలకు స్మార్ట్ మీటర్లు బిగించే విధంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకూ 46 వేల వ్యాపార కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తయ్యింది. స్మార్ట్ మీటర్ల బిగింపుతో బిల్లులు పెరిగిపోయి వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ.500 వరకూ బిల్లు కట్టే చిరు వ్యాపారులు సైతం ఇప్పుడు రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. దాదాపు వంద శాతం బిల్లులు అదనంగా వస్తున్నాయి. కొంతమందికి 70 శాతం వరకూ బిల్లులు అదనంగా వస్తున్నాయి. స్మార్ట్ మీటర్లు బిగించిన వినియోగదారులకు విద్యుత్ బిల్లులు ఇవ్వడం ఆపేశారు. ఫోన్‌లోనే బిల్లు చూపిస్తోంది. ఆ ప్రకారమే చెల్లించుకోవాల్సి ఉంటుంది. దీంతో బిల్లు అదనంగా వచ్చినా ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏలూరు పట్టణంలోని పవర్‌పేటలో ఏ వ్యాపారిని కదిపినా స్మార్ట్ మీటర్ల బిగింపు తర్వాత వస్తున్న బిల్లులు చూపి ఘొల్లుమంటున్నారు. జంగారెడ్డిగూడెం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు ఇలా ప్రతి పట్టణంలోనూ పరిస్థితి ఇదే విధంగా ఉంది.

గృహ వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన..

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ప్రస్తుతం వ్యాపార దుకాణాలకు మాత్రమే జరుగుతోంది. విద్యుత్ బిల్లులు పెరుగుతున్న తీరు గురించి వ్యాపారులు చెబుతుంటే గృహ వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ బిల్లులు మోత భారీగా ఉండే పరిస్థితి రానుంది. స్మార్ట్ మీటర్లను ప్రజలు ప్రతిఘటించాలని ఇప్పటికే వామపక్షాలు, పలు ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ప్రజలు పలుచోట్ల ఆందోళనలు చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. అదానీ కోసం మోడీ, చంద్రబాబు ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు తెగబడ్డారంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరోనా తర్వాత ఆదాయాలు తగ్గి జనం ఆర్థికంగా నలిగిపోతున్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమంటూ కూటమి హామీ ఇచ్చింది. వచ్చిన తర్వాత ట్రూఅప్ ఛార్జీల పేరుతో భారీగా విద్యుత్ భారాలు మోపింది. స్మార్ట్ మీటర్ల ముసుగులో విద్యుత్ భారాలను ప్రజల నెత్తిన రుద్దుతున్న పరిస్థితి నెలకొంది.



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సమస్యలు పరిష్కరించాలి

కోర్టు ముందు న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక కోర్టు ముందు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ వెంటనే అమలు చేయాలని, డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు ఇవ్వాల్సిన స్టయిఫండ్ రూ.10 వేలకు పెంచి వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి రమేష్, ఐలు జిల్లా అధ్యక్షులు చల్లా దానయ్యనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెక్కంటి క్రాంతికుమార్, పట్టణాధ్యక్షులు కానూరి బుజ్జి, పులపర్తి హర్ష, మల్లేడి కాశీనాథ్, బొలిశెట్టి నవీన్, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

సిపిఎం ఆధ్వర్యాన ప్రచార ర్యాలీ



ర్యాలీ చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అదాని స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించే చర్యలను తక్షణం ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 5వ రోజు అదానీ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ కడకట్ల, రామారావు పేటలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలని, ప్రజలపై అదనపు భారాలను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలో భాగంగా కూటమి ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లను బిగించాలని ఆలోచన చేస్తోందని దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 2 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటి స్థానంలో ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని వాపోయారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని తెలిపారు. సిపిఎం నిరంతరం ప్రజల కోసం నిజాయతీగా పోరాటాలు చేస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపు ఇచ్చిన మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల పేరుతో భారాలు మోపడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గతంలో చెత్త పన్ను చెల్లించకుండా సిపిఎం పెద్ద ఎత్తున పోరాటాలు చేసిందని, ఇప్పుడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడుదామని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపకపోతే దశల వారీ ఆందోళనలు చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, దత్తు రాము, నగిరెడ్డి సాయి, బర్ల బాలాజీ, బొడ్డపాటి శివ, యడ్ల శ్రీను, కొమ్మిరెడ్డి ఉదయ్ కుమార్, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

శివ వర్మను ఆదర్శంగా తీసుకోవాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి



కాళ్ల: పెదఅమిరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్

ప్రజాశక్తి - కాళ్ల

వేగిరాజు శివ వర్మను ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం పెదఅమిరం గ్రామంలో పలు ప్రారంభోత్సవాలు చేశారు. పెదఅమిరం పరిధిలో రతన్ టాటా మార్గం నుంచి కె.కన్వెన్షన్ ఎక్స్ రోడ్డు వరకూ సుమారు రూ.2.75 కోట్లతో నూతనంగా నిర్మించిన 'స్వామి వివేకానంద మార్గ్' సీసీ రోడ్డు, కల్వర్టులను ప్రారంభించారు. స్వామి వివేకానంద సేవాసమితి పర్యవేక్షణలో ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.86 లక్షలు, సమితి ద్వారా కె.కన్వెన్షన్ యాజమాన్యం రూ.69.50 లక్షలు, విఎస్ఎస్ గార్డెన్స్ యాజమాన్యం రూ.69.50 లక్షలు, ఈ సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీ పెద్దలు ఇచ్చిన రూ.50 లక్షలతో సుమారు 1.25 కిమీ పొడవునా నిర్మించిన రోడ్డుకు 'స్వామి వివేకానంద మార్గ్' అని పేరు పెట్టడం శుభపరిణామం అన్నారు. రహదారి ప్రారంభం అనంతరం సేవా సమితి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శివవర్మ వంటి వ్యక్తి ప్రతి గ్రామానికీ ఒకరు ఉంటే ప్రజలకు తమలాంటి రాజకీయ నాయకుల అవసరం ఉండదన్నారు. ఆయన స్వగ్రామమైన ప్రాతాళ్లమెరకలో చేసిన అభివృద్ధే దీనికి మంచి ఉదాహరణ అన్నారు. ఇదే విషయాన్ని గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ కూడా విషయం చెప్పినట్లు రఘురామకృష్ణరాజు వివరించారు. సేవా సమితి ఆధ్వర్యంలో నివేదిత విద్యాలయం ఏర్పాటు చేసి పేద ప్రజల పిల్లలకు క్రమశిక్షణతో కూడిన ఉచిత విద్యనందించడం అభినందనీయమన్నారు. ఆ పాఠశాలలో సాయంత్ర సమయంలో పురాణాలు, ఇతిహాసాలు బోధించడం శుభ పరిణామం అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు తెలియపర్చడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధి వేగిరాజు శివవర్మ, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, ప్రాతళ్లమెరక సర్పంచి కంతేటి ఉషా శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



ఆకివీడులో ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్

ఆకివీడు : ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మరో 10 రోజుల్లో ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తెలిపారు. స్థానిక సిహెచ్‌సిలో దాతల సహకారంతో డిప్యూటీ స్పీకర్ సమన్వయంతో ఎక్స్‌రే యూనిట్, డయాలసిస్ అనుబంధంగా బ్లడ్ స్టోరేజ్ యూనిట్, అవసరాల కోసం 30 కెవి త్రిఫేస్ జనరేటర్లు ఏర్పాటు చేశారు. ఈ మూడింటిని జిల్లా కలెక్టర్‌తో కలిసి డిపూటీ స్పీకర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, బ్లడ్ స్టోరేజ్‌ల ప్రారంభంతో డయాలసిస్ రెండు ప్రారంభిస్తామని అందుకోసం అవసరమైతే దాతలు సహకారం తీసుకుని రెండో భవనం కూడా నిర్మిస్తామని తెలిపారు.

త్వరలో ఆకివీడులో త్రీస్టార్ హోటల్

రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలోనూ త్రీస్టార్ ప్రారంభించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యం మేరకు త్వరలో నియోజకవర్గంలో కూడా ఈ హోటల్ ప్రారంభించాలని యోచన చేస్తున్నామన్నారు. అయితే తన నియోజకవర్గ పరిధిలోని ఏకైక మున్సిపాల్టీ ఆకివీడు గనుక ఇక్కడ ఈ హోటల్ నిర్మించాలని ఆలోచించామని తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి

వ్యకాస ఆధ్వర్యాన ఉపాధి కూలీల ధర్నా



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు, నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నవాబుపాలెం సచివాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ కార్యదర్శి జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలు 10, 12 వారాలు పనిచేస్తే కేవలం రెండు వారాలు మాత్రమే డబ్బులు చెల్లించి చేతులు దులుపుకున్నారన్నారు. ఇది దారుణమని విమర్శించారు. తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ఉపాధి కూలీలంతా ఐక్యమై మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్ బాబు. కండెల్లి విజయ నూతంగి సూర్యారావు, బైపో ప్రసాద్, దిద్దే అబ్బులు, కొల్లి మేరీ, ఉండ్రాజవరపు భాను, బడుగు మరియమ్మ, బండి శ్రీనివాస్, రాచర్ల నాగేశ్వరరావు, బ్రహ్మాయ్య, మల్లిపూడి చిట్టియ్య పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంలో అవకతవకలు

- చందాలు వసూలు చేసి.. ఆపై పంచాయతీ నిధులు కాజేసి..
- పెన్నాడ పంచాయతీ వార్డు సభ్యుడు నిర్వాకం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- తామర చెరువు ప్రాంతవాసుల ఆందోళన




డ్రెయినేజీని చూపిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ అగ్రహారం తామరచెరువు ప్రాంతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంలో అవకతవకలు జరిగాయి. ఆ ప్రాంతవాసులంతా చందాలు వేసుకుని సొంత ఖర్చులతో డ్రెయినేజీ నిర్మించుకుంటే వాళ్లకు తెలియకుండా పంచాయతీ నిధుల నుంచి డ్రెయినేజీ నిర్మించినట్లు చూపించి నిధులు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిలో భాగంగా తామర చెరువు ప్రాంతవాసులు వేండ్ర శ్రీనివాస్, గుత్తుల రాయుడు, పి.ఏసుబాబు, దొమ్మేటి సత్యనారాయణ, వేణుగోపాలం, పంపన వెంకటేశ్వరరావు, భద్రం, మోహనరావు, బాలాజీ శుక్రవారం డ్రెయినేజీ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. స్థానిక తామరచెరువు మూడో వార్డులో డ్రెయినేజీ నిర్మాణం చేయాలని పంచాయతీకి అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానికంగా నివాసం ఉంటున్న 26 కుటుంబాలు రూ.4 వేలు చొప్పున రూ.లక్ష 12 వేలు చందాలు వేసుకుని 2024లో సొంత ఖర్చులతో డ్రెయినేజీని నిర్మించుకున్నామని తెలిపారు. అయితే డ్రెయినేజీ నిర్మాణ బాధ్యతలు పంచాయతీ మూడో వార్డు సభ్యుడు చింతపల్లి శ్రీనివాస్‌తో పాటు గుత్తుల శ్రీనివాస్, గుత్తుల నాగరాజుకు అప్పగించామన్నారు. తమకు తెలియకుండా వార్డు సభ్యుడు చింతపల్లి శ్రీనివాస్ పంచాయతీ నిధుల నుంచి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించినట్లు చూపించి, తప్పుడు రికార్డులు సృష్టించి రూ.2 లక్షల 65 వేల 290 పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. తమకు విషయం తెలిసిన తర్వాత సంఘం సభ్యులంతా వార్డు సభ్యుడును అడిగినా సరైన సమాధానం చెప్పలేదని పేర్కొన్నారు. దీనిపై పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పంచాయతీ సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం జరిగిందన్నారు. డబ్బులు దుర్వినియోగానికి పాల్పడిన సంబంధిత వార్డు సభ్యుడితోపాటు మిగిలిన ఇద్దరిపై చర్యలు తీసుకుని తమ డబ్బులు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటరాజును వివరణ కోరగా తామర చెరువు ప్రాంతంలో 2024లో పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టడం వాస్తవమేనని తెలిపారు. 2024 ఫిబ్రవరి 3వ తేదీన రూ. లక్ష 50 వేలు, 2024 మార్చి 29న రూ.లక్ష 15 వేల 290 చొప్పున మొత్తం రూ.2 లక్షల 65 వేల 290 డ్రెయినేజీ నిర్మించిన కాంట్రాక్టర్, మూడో వార్డు సభ్యుడు చింతపల్లి శ్రీనివాస్ ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు.

అల్లూరి మెమోరియల్ హాల్ పునర్నిర్మించాలి

మున్సిపల్ కమిషనర్‌కు సాధన కమిటీ సభ్యుల వినతి



వినతి అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పున:నిర్మాణం చేపట్టాలని అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ సాధన కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం సాధన కమిటీ ఆధ్వర్యాన భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ సాధన కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ కూలగొట్టిన చోట పరిశుభ్రం చేసి ఫినిషింగ్ వేయించాలని కమిషనర్‌ని కోరారు. మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పేరున ఉన్న మెమోరియల్ హాలు పునర్నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు కూలగొట్టిన చోటే వెంటనే పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలకు ప్రభుత్వ భవనాలు లేవని అల్లూరి సీతారామరాజు భవనం ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించాలన్నారు. ప్రభుత్వం నిర్మించకపోతే దాతలు ముందుకు వచ్చి నిర్మాణం చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ ఉన్న ప్రాంతంలో చెత్తతో కూడిన డంపింగ్ యార్డ్‌లా ఉందని, దానిని క్లీన్ చేసి పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కమిషనర్ రామచంద్రారెడ్డి వెంటనే స్పందించి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు కమిషనర్‌కి ధన్యవాదాలు తెలిపారు. సాధన కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు, దండు శ్రీనివాసరాజు, ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి



రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారి గీతాబాయి

ప్రజాశక్తి - తణుకు

తణుకు పటణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఫ్రై డే డ్రై డే బలోపేతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. శుక్రవారం బ్యాంకు కాలనీలో పట్టణ ఆరోగ్య కేంద్రంను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ఒపి, రోగులకు అందుతున్న సేవలు నమోదు, మందులు అందుబాటు, ఇహెచ్‌ఆర్ నమోదు, అబా ఐడిలు, ఆరోగ్య సమాచారం కూడిన ఐఇసి గోడ పత్రికల ప్రదర్శన తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి గీతాబాయి మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది వార్డుల్లో ఆరోగ్య సర్వే తరచూ నిర్వహణ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారులు పాల్గొన్నారు.

పశుపోషణ వనరులపై సర్వే

భీమవరం : పశుపోషణకు అవసరమైన వనరుల కోసం జిల్లాలో సర్వే చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని కోళ్ల పెంపకం, గొర్రెలు పెంపకం, పశుగ్రాస పెంపకం తద్వారా వారి కుటుంబాలకు ఆదాయం పెంపొందించేందుకు పశుగణం కలిగిన ప్రతి గడపకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది వెళ్లాలన్నారు. అవసరమైన పాడి రైతు సమగ్ర వివరాలు, ఎదుర్కొంటున్న సమస్యలు అవగాహన లోపాలను గుర్తించి సర్వే చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సర్వేకు రైతులందరూ సహకరించాలని కోరారు.

నేడు గణపవరంలో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు శనివారం గణపవరంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని ఉంగుటూరు నియోజకవర్గ టిడిపి నాయకులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం స్థానిక కెవిపి ఫంక్షన్ హాల్‌లో జరిగే నియోజకవర్గ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడతారు. ఈ కార్యక్రమంలో గణపవరం సొసైటీ అధ్యక్షులుగా కూసంపూడి సురేందర్ మార్‌రాజు ప్రమాణ స్వీకారం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. సుపరిపాలనలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు కూడా పాల్గొంటారని చెప్పారు.

రైతులకు పంట రుణాల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ది మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘంలో రైతులకు కొత్తగా మంజూరు చేసిన పంట రుణాలను సొసైటీ ఛైర్మన్ కడలి భాస్కరరావు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 మంది రైతులకు గాను 14.50 లక్షల రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బలుసు శ్రీరామ్మూర్తి, తోరం ప్రసాద్, సొసైటీ కార్యదర్శి వేంద్ర విష్ణు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు, మద్యపానంపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాదకద్రవ్యాలు, మద్యపానం శారీరక, ఆరోగ్యానికి హానికరమని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకురాలు మల్లిపూడి మిత్ర తెలిపారు. శుక్రవారం దీక్ష డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యాన పడాల మార్కెట్ యార్డ్‌లో మాదకద్రవ్యాలు-మద్యపానం సేవించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లో పనిచేసే శ్రామికులు రోజంతా కష్టపడి శారీరక శ్రమ నుంచి విముక్తి పొందుటకై సాయంత్రానికి మద్యం సేవిస్తున్నారన్నారు. మద్యం తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలిగిస్తుందని, రాను రాను ప్రాణాంతకంగా మారి మిమ్మల్ని కుటుంబానికి దూరం చేస్తుందన్నారు. అందువల్ల మద్యపానానికి దూరంగా ఉండాలని ఆమె సూచించారు. కోఆర్డినేటర్ పి.వెంకటేష్ మాట్లాడారు. మద్యపానం, మాదకద్రవ్యాల నుంచి విముక్తి పొందేందుకు దీక్ష డ్రగ్ అండ్ డి అడిక్షన్ సెంటర్‌లో కౌన్సిలింగ్‌తో పాటు ఉచిత మందులు, భోజనం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సిబ్బంది, మార్కెట్ యార్డ్ శ్రామికులు పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరు ఆనంద ఫ్యాక్టరీలలో ఈగల్ టీం ఆధ్వర్యాన మత్తు పదార్థాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ టీం సభ్యులు కేతా మురళీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. చెడు వ్యసనాలకు లోనైతే సమాజంలో గుర్తింపు ఉండదని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రౌతు నాగేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ కొత్తపల్లి విశ్వనాథరాజు, హెచ్‌ఆర్ మేనేజర్ శీలం ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఉండకూడదు

పిహెచ్‌సి వైద్యులు ఎం.నవ్యజీవన్

పాలకొల్లు రూరల్ : ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, దాని ద్వారా డెంగీ వ్యాధి నుంచి రక్షింపబడతారని పిహెచ్‌సి వైద్యురాలు ఎం.నవ్యజీవన్ అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని లంకలకోడేరు గ్రామంలో జాతీయ డెంగీ మాసోత్సవం, ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.నవ్యజీవన్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్ ఎస్‌కె.అమలేశ్వర రావు, ఎం.దివాకర్ బాబు, టి.హరిబాబు, ఎల్ టి.ప్రసాద్, మార్తమ్మ, సుశీల, రోజా కమల, సుజ్ఞానమని, ఆశా కార్యకర్తలు, ట్రెయినీ జిఎన్‌ఎం పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

నరసాపురం: నరసాపురం పట్టణం 15వ వార్డులో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మైనారిటీ అఫైర్స్ అడ్వైజర్, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొని ప్రతి ఇంటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 15వ వార్డులో స్థానికంగా నివసిస్తున్న సర్కార్, జాఫర్ అన్నదమ్ముల కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున మొత్తం రూ.65 వేల నిధులను తల్లికి వందనం అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, శంకు భాస్కర్ నాయుడు, డాక్టర్ శిరినిడి [illegible] పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంలో జరిగిన టిడిపి మండల అధ్యక్షులు కొడవిటి నాగేశ్వరరావు అన్నారు. తనకు సహకరించిన యూనిట్ ఇన్‌ఛార్జులు, మండలంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులకు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థుల ఖర్చుల నిర్ణయంపై ఆదేశం

పెనుమంట్ర : విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ స్కూల్లో చేరిన ఒక్కో విద్యార్థి పై ఖర్చుల నిర్ణయిస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసినట్లు స్థానిక ఎంఇఒ-2 యు.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత విద్య కింద ప్రయివేట్ పాఠశాలల్లో సీట్లు పొందిన ఒక్కొక్క విద్యార్థి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఖర్చును ప్రకటించిందన్నారు. స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టార్ రేటింగ్ ప్రయివేట్ స్కూల్లో ఒక్కో విద్యార్థి వార్షిక ఖర్చు కింద స్టార్-1కు రూ.8,500, స్టార్-2కు రూ.10 వేలు, స్టార్ -3కు రూ.11,500, స్టార్-4కు రూ.13 వేలు, స్టార్-5కు రూ.14,500లుగా నిర్ణయించారని ఆయన తెలిపారు. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ [illegible] ద్వారా స్కూలుకు వారి బ్యాంక్ ఖాతాలో నేరుగా చెల్లించబడుతుందని, ఇది రెండు ఇన్‌స్టాల్‌మెంట్లలో జరుగుతుందని, మొదటి 50 శాతం సెప్టెంబర్ నెలలో, మిగతా 50 శాతం జనవరి నెలలో చెల్లించబడుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ఉండి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టిడిపి నాయకులు కనుమూరి భరత్ అన్నారు. శుక్రవారం ఉండి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చదువు [illegible] ఉద్దేశ్యంతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కానుకను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదని అన్నారు. విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం వై.రామలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.


ఏజెంట్ల మోసంపై అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు రూరల్: రొయ్యల చెరువుల వద్ద తూకం తూస్తున్న ఎలక్ట్రానిక్ కాటాల్లోని తక్కువగా మార్పు రైతుల నుండి కిలోకి 60 నుంచి 80 గ్రాముల వరకు తూకంలో ఏజెంట్లు మోసం చేస్తున్నారని ఆక్వా రైతు సంఘం ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ కాటాలలో వివిధంగా మార్పు మోసం చేస్తున్న వివరాలను సమావేశంలో వివరించారు. ఏజెంట్లు చేసే మోసంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి బొడ్డు దినబాబు, పెన్మెత్స సత్యనారాయణ రాజు, మేడిది జాని రాజు పాల్గొన్నారు.

త్వరలో నూతన పింఛన్ల మంజూరు

తోట సీతారామలక్ష్మి

భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకురాలు, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి శుక్రవారం స్థానిక ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు నూతన పెన్షన్ల కోసం అర్జీలు అందిస్తున్నారని, త్వరలోనే నూతన పెన్షన్లు ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. [illegible] గ్రామానికి చెందిన కార్యకర్త గోవిందరావు ఇటీవల కరెంటు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబానికి రూ.5 లక్షల మంజూరైనట్లు, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ ఏఈ సర్టిఫికెట్ ఇవ్వనందున లబ్ధిదారులకు నగదు జమ కాలేదని సంబంధిత అధికారులతో మాట్లాడి [illegible] తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, ఉప్పులూరి చంద్రశేఖర్, ఎన్.టి.ఆర్.రాజు, కోట్ల శ్రీనివాస్, గొలగాని రమేష్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మార్కెట్ యార్డు ఆర్థిక స్థాయి పెంచుతాం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆర్థిక స్థితిని మరింత స్థాయి పెంచే విధంగా కృషి చేస్తామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఎట్టకేలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం శుక్రవారం పదవి ప్రమాణ స్వీకారం చేసింది. మార్కెటింగ్ శాఖ ఆర్‌జెడి ఎ.నాగేశ్వరరావు, ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, వైస్ ఛైర్‌పర్సన్ గవర లక్ష్మి, సభ్యులతో మూడు ధపాలుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లి మార్కెట్ యార్డ్ ద్వారా రైతులకు, ప్రజలకు అందవలసిన సహకారాలను అందజేస్తామన్నారు. ఈ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ముందుగా గుర్తిస్తామన్నారు. వాటిని బాగు చేయించి ప్రజా వినియోగంలోకి తెస్తామన్నారు. చిన్న మున్సిపాలిటీలలో ఆకివీడును రాష్ట్రంలోనే అత్యున్నతంగా తీర్చిదిద్దడం తన సంకల్పం అన్నారు. రానున్న ఐదు ఆరు నెలల్లో నగర పంచాయతీ పరిధిలో మంచినీటి సమస్య నూరు శాతం పరిష్కరించే దిశగా ముందుకెళుతున్నామన్నారు. ఆకివీడును సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రజలు, దాతలు సహకరించాలని ఆయన కోరారు. జనసేన జిల్లా అధ్యక్షులు కుటికలపూడి గోవిందరావు, మాజీ ఆప్కాబ్ వైస్ ఛైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం), నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు.

చింతలకోటి గరువులో కోతి దాడి

పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి : గ్రామస్తులు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని చింతలకోటి గరువు గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా ఒక కోతి మనుషులపై తరచూ దాడి చేస్తుందని గ్రామస్తులు తెలిపారు. కోతి దాడి చేస్తున్న విషయం పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. ఒంటరిగా సంచరిస్తున్న ఈ కోతి మహిళలపైన గ్రామంలోకి కొత్తగా వచ్చిన వారిపైన దాడి చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తరచూ ఆటోలో ప్రయాణిస్తున్న వారిపై ఈ కోతి దాడి చేస్తుందని అంటున్నారు. ఇదేవిధంగా శుక్రవారం వీరవాసరం నుంచి పని నిమిత్తం ఆ గ్రామానికి వెళ్లిన కాసాని పెద్దిరాజు అనే వ్యక్తిపై కోతి దాడి చేసిందని తెలిపారు. ఈయన వీరవాసరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ప్రాథమిక వైద్యం చేయించుకున్నాడు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కోతిని పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేష్

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ మంత్రిత్వ శాఖ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు ఆన్ లైన్‌లో ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాలలో అత్యుత్తమ ధైర్యసాహసాలు, ప్రతిభ కనబరిచిన(సాంస్కృతిక, సమాజసేవ, క్రీడలు, సైన్సు, టెక్నాలజీ, ఎన్విరాన్మెంట్) 5 ఏళ్ళ నుంచి 18 ఏళ్ల లోపు బాలలు వక్తిగతంగా కానీ, ఏదైనా సంస్థ ద్వారా కానీ బాలల వ్యక్తిగత వివరాలు, వారు సాధించిన ప్రతిభకు సంబంధించిన సర్టిఫికెట్స్, పత్రికలో ప్రచురించబడిన పేపర్ క్లిపింగ్స్, ఇతర సంబంధిత డాకుమెంట్స్ (https://awards.gov.in/Registration/SighUp) ద్వారా ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేష్ 9491063818ను సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి

ప్రజాశక్తి - నరసాపురం

పర్యావరణ పరిరక్షణకు మనందరం కృషిచేయాలని, రానున్న రోజుల్లో ప్రతీఒక్కరూ స్వేచ్ఛా, ఆరోగ్య వాయువులను పీల్చుకోవాలంటే యువత మొక్కలను నాటి, వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి అన్నారు. స్థానిక శ్రీవైఎన్ కళాశాల జాతీయ సేవా పథకం, నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మ కోసం ఒక చెట్టు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి విచ్చేసి తల్లి పేరుపై ఒక మొక్క నాటినట్లయితే దానిని జాగ్రత్తగా పెంచుతారని, తద్వారా పర్యావరణానికి మన వంతు సాయం చేసిన వారవుతారని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. తమ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం బాధ్యత అని చెబుతూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే చాలా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు కూడా ఇబ్బందులు పడతారని, కాబట్టి బాధ్యతాయుతంగా ఉంటే అంతా సామరస్యంగా ఉంటుందని అన్నారు. తదనంతరం పోటీ పరీక్షలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అటు పిమ్మట మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనక రావు, డీన్ ఆచార్య గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్, జాతీయ సేవా పథకం యూనిట్ ఆఫీసర్స్ చింతా సోమేశ్వరి, సాధె యాకోబు పాల్గొన్నారు.

సురక్ష జలాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఉండి: శుద్ధి చేయని జలాల వల్ల ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని, దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పథకంలో భాగంగా మైక్రో ఫిల్టర్‌లను ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వెలివర్రు గ్రామంలో రూ.27 లక్షల వ్యయంతో నిర్మించిన మైక్రో ఫిల్టర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. గ్రామ సర్పంచి పెన్మెత్స అంజనీ దేవి, ఉప సర్పంచి ముదునూరి శ్రీనివాసరాజు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు.

ర్యాంపు పథకం అమలుపై కేంద్రీకరించాలి : కలెక్టర్

భీమవరం :సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాయిని పెంచే ర్యాంపు పథకం అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడేలా ఉద్యమ్ వర్క్ షాపులు నిర్వహించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా అనుమతులను మంజూరు చేయాలని ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాంపు పథకం ముఖ్య ఉద్దేశ్యం ఎంఎస్‌ఎంఇల స్థాయిని పెంచడం అన్నారు. జిల్లాలో ఈ పథకం అమలుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఉద్యమ్ నమోదు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఆన్‌లైన్ ఆధారిత విధానం అన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు పాల్గొన్నారు.

పి-4లో భాగస్వాములు కావాలి..

జిల్లాలో పేదరిక నిర్మూలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు పి-4పై కలెక్టర్లు, అధికారులు ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మార్గదర్శకుల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, సిపిఒ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

సిఐ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పురు జెడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు వాలీబాల్ పోల్స్, వాలీబాల్ కిట్టును ఆయన నరసాపురం రూరల్ ఎస్ఐ టి. వెంకట సురేష్‌తో కలిసి స్కూల్ హెచ్‌ఎం ఎస్.తాతయ్యకు అందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్ధేశించి మాట్లాడుతూ చిన్నతనం నుంచి భవిష్యత్తుపై ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. దాన్ని సాధించినందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఆటలో రాణించిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు వివిధ క్రీడలపై పట్టు సాధించాలని తెలిపారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం కూడా ఉంటుందని తెలియజేశారు. టివి, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలకనుగొనంగా విద్యార్థులు చదువుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



వాలీబాల్ కిట్స్ అందజేస్తున్న రూరల్ సిఐ, ఎస్ఐ

నాణ్యమైన గృహాన్ని నిర్మించుకోండి : ఎంఎల్ఎ

భీమవరం టౌన్: ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ పథకంలో పేదలు అందమైన, నాణ్యమైన ఇళ్లను త్వరగా నిర్మించుకోవడానికి దృష్టిపెట్టాలని, లబ్ధిదారులు తమ వాటాను త్వరగా చెల్లించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. విస్సాకోడేరు లేఅవుట్‌లో గృహ లబ్ధిదారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రధాన రహదారి సరిగా లేదని లబ్ధిదారులు అనుమానించ వద్దని, భవిష్యత్‌లో అందమైన హౌసింగ్ కాలనీ చూడబోతున్నారని, 4,600 ఇళ్లకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలను ఇప్పటికే అందించడం జరిగిందని అన్నారు. త్వరలోనే ఈ కాలనీ రహదారికి రూ.కోటి 50 లక్షలతో అంతర్గత రోడ్లు, మొత్తం రూ.8 రోడ్లతో నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు హౌసింగ్ కాలనీ కార్యక్రమాలను నిర్వహించడానికి ఒక కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే రెండు సార్లు బెస్ట్ క్వాలిటీ అవార్డ్‌ను తీసుకున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబు మాట్లాడుతూ ఈ లే అవుట్‌లో 4,600 ఇళ్లకి ఇప్పటి వరకు 2,184 మొదలు పెట్టినవి, 500 స్లాబ్ వేశామని, 1000 వరకు బేస్‌మెంట్ వేశామని, పూర్తిగా 150 ఇళ్లను పూర్తి చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు రూ.లక్ష 50 వేలు ఇస్తే ప్రభుత్వం లక్ష 80 వేలు అందిస్తుందని, ఈ డిసెంబర్‌లోగా లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిం-2 విధానంలో రాష్ట్రంలో భీమవరంలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి పిచ్చయ్య, ఎంఇ త్రినాథ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ

కమ్యూనిస్టు యోధుడు అచ్యుతానందన్

సిపిఎం ఆధ్వర్యాన ఘన నివాళి



భీమవరంలో నివాళి అర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్‌కు సిపిఎం జిల్లా కేంద్రం శాఖ ఘనంగా నివాళులర్పించింది. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం టి.గంగరాజు అధ్యక్షతన జరిగిన శాఖ సమావేశంలో అచ్యుతానందన్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.క్రాంతిబాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ కేరళలో అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా, మాస్ లీడర్‌గా అచ్యుతానందన్ ఉన్నారన్నారు. సిపిఎం ఆవిర్భావం నుంచి ఉన్న నేతల్లో ఆయన కూడా ఒకరిని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగిన అన్ని పోరాటాలలోను ఆయన ఉన్నారని గుర్తుచేశారు. నేటి తరానికి ఆయన జీవితం ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, రఫాయేలు, నరేష్, రత్నకుమారి పాల్గొన్నారు.

పెనుగొండ : కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్ట్ దిగ్గజం విఎస్.అచ్యుతానందన్ సుదీర్ఘ రాజకీయ జీవితం, కార్మిక హక్కుల పోరాటం చరిత్రలో నిలిచిపోతాయని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. గ్రామ శాఖ సమావేశం శుక్రవారం నిర్వహించి అచ్యుతానందన్‌కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ అచ్యుతానందన్ కేరళ రాజకీయాల్లో సమర్థ నాయకుడిగా, ప్రజా సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషిచేసిన కమ్యూనిస్టు యోధుడన్నారు. ఆయన మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన సామాజిక న్యాయం, పేదల ఉద్ధరణ కోసం చేసిన పోరాటం కార్యకర్తలకు శాశ్వత స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె.పాదుషా, శాఖ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు, పులిదిండి రామారావు, మాదాసు నాగేశ్వరరావు, రాజమహేంద్రవరపు వెంకటేష్, గుడిమెట్ల వరహాలు రెడ్డి పాల్గొన్నారు.



పెనుగొండలో..

ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటలు

జిల్లా కోఆర్డినేటర్ నూకరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎటువంటి పురుగుమందులు లేకుండా ప్రకృతి విధానంలో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చుని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ నూకరాజు సూచించారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం రైతు సేవా కేంద్రంలో సబ్ డివిజన్ పరిధి తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాలకు చెందిన విఎఎ, విహెచ్‌లకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయం ఏవిధంగా ఆచరించాలి అనే విషయమే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేశారు. ప్రస్తుతం సీజన్‌కు అనుకూలంగా రసాయన ఎరువులు వాడకం బదులుగా సేంద్రీయ ఎరువులు వాడటం వల్ల రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని వివరించారు. బీజామృతం, ద్రవ బీజామృతం, ఘన బీజామృతం, కోడుగుడ్డు నిమ్మరసం ద్రావకం తయారు చేసే విధానాన్ని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు వి.నారాయణరావు, చీర్ల రవికుమార్, డి. విద్యాసాగర్, విఎఎ, విహెచ్‌ఎలు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ నూకరాజు

వరి శాస్త్రవేత్త డాక్టర్ సునీతకు అవార్డు

పెనుమంట్ర : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగిన 57వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి వరి పంటకు అనువైన విత్తనాలు రూపకల్పనలో విశేషమైన సేవలు అందిస్తున్న మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వై.సునీత అవార్డు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవానికి గవర్నర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనపరచిన వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేశారని స్థానిక ఫారం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు సస్య ప్రజనన విభాగంలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ వై.సునీత 2011 నుంచి వరి సస్య ప్రజననంలో చేసిన విశిష్ట సేవలకు గాను 'మెరిటోరియస్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డు'ను అందుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ సునీత మార్టేరు(18 రకాలు), బాపట్లలో(5 రకాలు) వరి పరిశోధనా స్థానాల నుండి మొత్తం 23 వరి రకాల అభివృద్ధి, విడుదలలో భాగస్వామిగా ఉన్నారన్నారు. అదనంగా 1 జన్యు స్టాక్ అభివృద్ధి చేశారని, అనేక జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత జర్నళ్లలో 99 పరిశోధనా వ్యాసాలు ప్రచురించారని, అంతేకాక 15 మంది పీజీ, పిహెచ్‌డి విద్యార్థులకు విజయవంతంగా మార్గనిర్దేశనం చేశారని అన్నారు. 7 పరిశోధనా సంస్థలలో జీవిత సభ్యురాలిగా కొనసాగుతున్నారని, డాక్టర్ సునీత ప్రస్తుతం మధ్య కాల వ్యవధి కలిగిన వరి రకాల అభివృద్ధిలో పరిశోధనలు చేస్తూ ఐఆర్‌ఆర్ఐ(అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ), డిబిటి(బయోటెక్నాలజీ విభాగం) సహకారంతో కూడిన అనేక ప్రాజెక్టులతో సంబంధం కలిగి ఉన్నారన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్, ఇతర శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సునీత

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎవరైనా లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ సెంటర్లను సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి పలు ప్రయివేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక రవి మాధవ్ నర్సింగ్ హోం, విజయ హాస్పిటల్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఎపిఎంసిఇ చట్ట పరిధిలో ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తున్నది, లేనిది ఆయా ఆసుపత్రుల రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా పిసిపిఎన్‌డిటి చట్ట పరిధిలో స్కానింగ్ సెంటర్ల నిర్వహణ పరిశీలించి తగు సూచనలు చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో ఎపి కళాశాల కమిషనరేట్ వారి ఉత్తర్వుల మేరకు సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 సంవత్సరాలు అయిన సందర్భంగా కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన సమాచార హక్కు చట్టం-2005పై వ్యాసరచన, వక్తృత్వం, చర్చ (డిబేట్), క్విజ్ పోటీలను 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించారు. సమాచారం హక్కు చట్టంపై నిర్వహించిన వివిధ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.ఉషారాణి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి, అధ్యాపకులు డాక్టర్ వి.విజయలక్ష్మి, బి.రామలక్ష్మి, వి.శిరీష, కె.పార్థసారథి, ఎం.శిరీష, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మొగల్తూరులో మంత్రి సత్యప్రసాద్ పర్యటన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం పడమరలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగని సత్య ప్రసాద్ శనివారం పర్యటించనున్నారని టిడిపి మొగల్తూరు మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విప్ బొమ్మిడి నాయకర్, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఏడు గ్రామాలకు నూతన కార్యదర్శులు

ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలో ఏడు గ్రామాలకు నూతన గ్రామ కార్యదర్శులు బాధ్యతలు చేపట్టినట్లు ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్ తెలిపారు. దర్భరేవు గ్రామానికి పోతుల రవికుమార్, గొంది దాసరి సురేశ్, కె.బేతపూడి టి.గణేశ్, రుస్తుంబాద పెదపాటి శేఖర్ బాబు, యర్రంశెట్టిపాలెం ఐ.ఎన్.రాజు, సీతారాంపురం నార్త్ కె.సూర్యనారాయణ, చామకూరిపాలెం వర్ధనపు ప్రతిభ గ్రామ కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ముస్కూడి మంగ, భర్త, రాజబాబు, డోర్ నెంబర్ 14-13-15/1, దేవుని తోట, రాయ్ పేట, నరసాపురం, ప.గో.జిల్లా,ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి F4750025 నెంబర్, పాస్ పోర్ట్ ది 13-9-2005న మా అమ్మగారి ఇంటి పేరున(ఈతకోట మంగ, ఆధార్ నెంబర్ 8669 8613 3640) తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తీసికొని మా ఇంటి నుంచి రాయ్ పేట కు మోటార్ సైకిల్ పై పాస్ పోర్ట్ జెరాక్స్ కాపీలు తీయడం కోసం రాగా దారిలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెదికినా దొరకలేదు. కాబట్టి నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికిన నా పై అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ : 9347385789

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా కోర్టు / ఫ్యామిలీ కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు

ఐ.ఎ.నెం.1/2025

ఓ.ఎస్.నెం.15/2017

శ్రీ కురెళ్ళ సోమసుందరరావు (డైడ్)
శ్రీమతి కురెళ్ళ నాగపుష్పావతి వగైరా
...పిటీషనర్లు/వాదులు
మరియు
శ్రీ కురెళ్ళ శివరామకృష్ణ వగైరా
...రెస్పాండెంట్లు /డిఫండెంట్లు

పై నంబరులో పిటీషనర్లు ది.27.06.2024వ తేదీన జారీ చేసిన ప్రిలిమనరీ డిక్రీని పురస్కరించుకొని, కమీషనరును నియమించి దావా ఆస్తులు విభజించి ఫైనల్ డిక్రీ ఉత్తరువులు యివ్వవలసినదిగా పై నంబరు పిటీషను దాఖలు చేసినారు. సదరు పిటీషనులో 1.కురెళ్ళ లక్ష్మీ చూడామణి (ఆర్-3) 2.ఆకుల కృష్ణకుమారి (ఆర్-4), 3.కురెళ్ళ ప్రమీలారాణి (డి-5), 4.కురెళ్ళ ఉదయం భాస్కరలక్ష్మి (డి-6)లకు నోటీసు నిమిత్తం ది.04.08.2025 తేదీ వాయిదా అయివున్నది. కాబట్టి సదరు రెస్పాండెంట్లు పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30 ని॥లకు పైతేదీని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల వారి పరోక్షమున తగు ఉత్తర్వులు జారీ చేయబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఏలూరు | ఎస్.వి.ఆర్.గాంధీ
తేది.25.07.2025 | అడ్వకేట్

MUNICIPAL CORPORATION, ELURU

TENDER NOTICE No.93/General/2025-26, Dated.25.07.2025

The Commissioner, Municipal Corporation, Eluru inviting tenders from the interested, eligible Contractors for **"Supply of 5 Nos of Hire Cars to the Officials in Eluru Municipal Corporation"** with an amount of Rs.23.40 Lakhs.

Last date for receipt of application towards tender schedule is 01.08.2025. Last date of receipt of tenders is 02.08.2025. Further details can be known from this office detailed tender notice or Contact Commissioner, Municipal Corporations, Eluru, Eluru District (Phone/Fax: 08812-232101.)

Sd/- Commissioner
Municipal Corporation, Eluru.